# 38. మేధావి కల

"నువ్వు ఇరవయ్యేళ్లు విదేశాల్లో వుండి సంపాదించిన కోట్లాది రూపాయల సొమ్ముకి ఇన్నాళ్లకి సక్రమమైన ఉపయోగం మన ఇండియాలోనే, మన రాష్ట్రంలోనే సమకూర్చేను. అంచేత నువ్వు అక్కడ సంపాదించిన స్థిరాస్తులు కూడా అమ్మేసి చక్కగా ఇంటికొచ్చెయ్యి. మనది చాలా పెద్ద సంస్థ. దానికి నువ్వు చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరక్టర్‌గా ఉండి అటు దేశానికి ఉత్పత్తి ద్వారాను ఇటు కుటుంబానికి లాభాల ద్వారాను సేవ చేద్దువుగాని. నీ పిల్లలూ, భార్యా మళ్లీ ఎప్పట్లా వరి అన్నం, గేదె నెయ్యి, గోంగూర పచ్చడి, మామిడికాయ వూరగాయ తిని చచ్చిపోయిన జిహ్వల్ని మళ్లా పునరుద్ధరించుకోవచ్చు." అని మా నాన్నగారు రాసిన ఉత్తరం చూసి ఇండియా, దటీజ్ భారత్‌కి వచ్చేశాను. ఇప్పుడాయనికి అరవై నాలుగేళ్లు. మా సంస్థ చైర్మన్ కమ్ మేనేజింగ్ డైరక్టర్‌గా ఆయనే ఉండొచ్చుగానీ ఈ వయస్సులో ఆయనకది అలవిమాలిన శ్రమ అవుతుందని పితృ ప్రేమ చేత కూడ ఈ నిర్ణయం తీసుకున్నాను.

ఈ ఫ్యాక్టరీ ఇరవై ఏళ్ల కిందట పబ్లిక్ సెక్టార్‌లో అంటే కేంద్ర ప్రభుత్వపు యాజమాన్యం కింద స్థాపించేరు. కోట్లకొద్దీ రూపాయలు పెట్టుబడి పెట్టి విదేశీ సలహాదార్ల సహాయంతో ఆనాటికి అధునాతనం అనిపించిన రకం యంత్రాలతో ఫ్యాక్టరీని తీర్చిదిద్దేరు. కాని కాలక్రమేణా ఫ్యాక్టరీ ఉత్పత్తి ఓ పక్క పెరుగుతూనే ఉన్నా నష్టాలు కూడా అంతకి తగిన నిష్పత్తిలో పెరిగేయి. దాంతో ప్రభుత్వం "ఎలా ఉన్నది అలాగ" పద్ధతిమీద ఈ ఫ్యాక్టరీని వేలం వేసి మా నాన్నగారు పాడిన మేరకి అందిన సొమ్ము పుచ్చేసుకొని ఫ్యాక్టరీ ఆయన పరం చేసేసేరు.

నేను వివిధ పాశ్చాత్య దేశాల్లో పనిచేసిన రెండు దశాబ్దాల కాలంలోను నేర్చుకున్నది ఏమిటంటే, ఫ్యాక్టరీ యజమానిగా నాకు, నా ఫ్యాక్టరీలో ఉన్న ప్రతి యంత్రం, ఆఫీసులో ఉన్న ప్రతిటేబులు కుర్చీ, ఉద్యోగుల్లో ప్రతి వ్యక్తీ నాకు బాగా పరిచయం. తక్కువ సమయంలో తక్కువ కష్టంతో ఎక్కువ ఉత్పత్తి సాధించి ఎక్కువ లాభం సంపాదించాలి. ఆ లాభాల్లో నా ఉద్యోగులకి భారీగా వాటాలు (జీతం, బోనసు, బహుమతుల రూపంలో) ముట్టచెప్పడం అలవాటుచేసుకుంటే ప్రభుత్వానికి మన మీద పన్ను విధించే అవకాశం పెద్దగా ఉండదు. 70 కోట్ల మంది భారతీయులకి నేను కట్టే పన్నుల వల్ల కలిగే సుఖం కన్నా ఏడు వేల మంది నా ఉద్యోగులు నా కంపెనీ పట్లా నా పట్లా విశ్వాసపాత్రులై పనిచేసి నేనిచ్చే ప్రతిఫలం వల్ల పొందే సుఖం నాకు ఎక్కువ ఇష్టం.

"ఇవాళ కొందరు ముఖ్యమైన వ్యక్తుల్ని నీకు పరిచయం చేస్తాను." అన్నారు నాన్నగారు; నేను ఫ్యాక్టరీకి బయలుదేరిన మొదటి రోజున. "ఆదేలెండి. కొందరు ముఖ్యమైన వ్యక్తులకి నన్ను పరిచయం చేస్తారు." అన్నాను " రెండూ ఒకటే కదా? " అనేసికూడా; 'రైట్... రైట్; నువ్వన్నదే రైట్' అన్నారు నాన్నగారు.

"ఇదుగో; ఈయన మన చీఫ్ ప్రొడక్షన్ మేనేజర్ పి.ఆర్.వడ్‌సెల్, ఈయన మన చీఫ్ ఇంజనీర్ ఎ.ఎస్.కంబం, ఆయన డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వి.బి.కొండాల్, అదుగో ఆయన మన ఫ్యాక్టరీ ఆస్పత్రి చీఫ్ సర్జన్ కె. రాబట్, ఆయన పక్కనే మన చీఫ్ పెర్సనల్ ఆఫీసర్ ఎం.ఎ.కార్,

అదుగో, ఇప్పుడే లోపలికొస్తున్నాయన పి.జె.జె.రామ్ అని చీఫ్ సేల్స్ మేనేజర్" అని, "ఒక్క నిమిషం! అబ్బాయికి తన గది చూపించొస్తాను" అని వాళ్లనందర్నీ కూర్చోమని, మా నాన్నగారు నన్ను నా ఛాంబర్స్‌లోకి తీసుకెళ్లేరు. "వాళ్ల పేర్లేంటి నాన్నారూ, అలావున్నాయి?" అన్నాను.

'అబ్బే, అందరూ తెలుగు వాళ్లే. పి.ఆర్.వడ్‌సెల్. అంటే వడిసెల పెంటారావు, ఎ.ఎస్.కంబం అంటే కంబం అప్పలస్వామి, వి.బి.కొండాల్ అంటే కొండల వీరబాహు. అలాగే మిగతా వాళ్లూనూ.'

"చిన్న వయస్సులోనే పెద్ద పెద్ద పోస్టులకి వచ్చే సేరే- సమర్థులేనా?"

"సమర్థులా మరీ సమర్థులా? అందులోనూ మన ఎ.ఎస్.కంబంగారూ, కె.రాబట్‌గారూ ఉన్నారే; అంత సమర్థులు నీకెక్కడా తగలరు. చదువుల్లో ముప్పయ్యేసి మార్కులే తెచ్చుకున్నా వాళ్లకున్న చాకచక్యం అనంతం. ఎ.ఎస్.కంబంగారు మన ఫ్యాక్టరీకి వేసిన రోడ్డులో ఒక పెద్ద బ్రిడ్జి ఉంది కదా. ఓసారి గాలివాన వస్తే ఆబ్రిడ్జి కూలిపోయి దానికింద తలదాచుకున్న వంద మంది వర్కర్లు చచ్చిపోయారు. వానరావడం వల్లనే బ్రిడ్జి కూలిపోయింది తప్ప బ్రిడ్జి నిర్మాణంలో పొరపాటేం లేదని, చచ్చిపోయిన వాళ్లందరి జాతకాల్లోనూ చావు రాసిపెట్టి ఉండడమే కారణం తప్ప బ్రిడ్జి కూలిపోవడం వల్ల వాళ్లెవరూ చచ్చిపోలేదని రిపోర్టులు తయారు చేయించి మినిస్టర్ గారితో వేసిన కమిటీకి నచ్చచెప్పేడు. అంతే కాదు, అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరి తన సామర్థ్యంతో అంచెలంచెలుగా పైకొచ్చి చీఫ్ అయ్యాడు. డిప్యూటీ చీఫ్‌గా చాలా కాలం మగ్గిపోయాడు కాని ఇతను సృష్టించిన సమస్యలకి పరిష్కారం చెప్పలేక అప్పటి చీఫ్ బతికుంటే బలుసాకు తినొచ్చని రిజైన్‌చేసి వెళ్లిపోయాడంటే సమర్థుడా సమర్థుడున్నరా?"

"మరి ఆ రాబట్ గారేంటి, అలా ఏ భావంలేని మొహం అతనూ?" అన్నాను.

'నిజమైన పెద్ద మనిషి . ఓసారేమైందిటా. కాలనీలో ఏదో విందు జరిగింది. అక్కడ వాళ్లు తిన్నదాంట్లో ఏం కల్తీవుందో గాని రాత్రి తొమ్మిది నుంచి ఉదయంలోగా నూట ఎనభై మంది ఆస్పత్రిలో చేరారు. కంగారులో ఎవరో గవర్నమెంటు ఆసుపత్రికి ఫోన్‌చేస్తే అక్కణ్ణుంచి విషాహారానికి విరుగుడు, వాంతులు తెచ్చే మందులూ పట్టుకుని వాళ్లు వచ్చినా సరే; 'నేనిక్కడుండగా మీరంతా ఎందుకు' అని వాళ్లను తరిమేసి నూట ఎనభై మందిలో ముప్పయి మందిని రక్షించేడు. రాత్రి ఒంటిగంట లోపుగా గవర్నమెంటు సిబ్బంది విందు జరిగిన చోటుకి వెళ్లి శాంపిల్సు తీసి ఎనలైజ్ చేసి కారణం ఫలానా అని కనిపెట్టేరు కాని అప్పటికి రాబట్ గారు మంచి నిద్దట్లో ఉండడాన్న అక్కడ నర్సులెవరూ చికిత్స మార్చలేకపోయారు. రాబట్ అన్నందుకు మరమనిషిలాగ పనిచేసేడు.'

"ఏంటో నాన్నగారూ, నాకెందుకోగాని, ఈ పెద్ద వుద్యోగాల్లో వీళ్లకన్నా సమర్థుల్ని వేసుకుంటే బావుంటుందనిపిస్తోంది. రావల్సిందేదో ఇచ్చేసి వీళ్లని పంపించేద్దాం." అన్నాను. "అలా కుదరదు నాయనా, ఏడు వేల మంది ఉద్యోగుల్లో దాదాపు ఆరువేల మందికి వీళ్లందరూ అంటే పరమ - మహా ఇష్టం. వెంటనే ఫ్యాక్టరీ మూతపడిపోతుంది. సమ్మె చేస్తారు. కోర్కెలు తీరేదాకా విధ్వంసకాండ చేపడ్తారు. యంత్రాలను విరక్కొట్టేస్తారు. పని చెయ్యడంలో సామర్థ్యం ఎలా ఉన్నా విధ్వంసంలో అందెవేసిన చేతులు. మళ్లీ వాళ్లు ఏమీ చదువుకోనేలేదు. కొందరికి సంతకాలు పెట్టడం కూడా రాదు!"

"అయ్యో, దేశంలో బోలెడుమంది విద్యావంతులు ఉద్యోగాల్లేక అలమటిస్తూ ఉంటే నిరక్షరాస్యుల్ని చేరదీశారా?" అని వాపోయాను.

"మరేం చెయ్యాలి! వాళ్లలో ఏ ఒక్కరి విషయం తీసుకున్నాసరే ఒక పరమ సత్యం ఉంది. వాళ్ల తాతగార్ల తాతగార్లని వేదాలూ, పురాణాలూ చదవనివ్వలేదు. పైగా; వీళ్ల భూముల్లో తలా ఒక చిన్న మడి చెక్కా ఈ ఫ్యాక్టరీ కట్టడం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. నష్టపరిహారం భారీగా ఇవ్వడం వల్ల దురలవాట్లు ఏర్పడి అంతా వేగం ఖర్చయిపోయింది. కొందరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు కూడా ఇచ్చేరు. అవి అమ్ముకున్నా ఎక్కువ డబ్బు వచ్చేసింది. కొందరేమో ఆ డబ్బు పెట్టి వ్యాపారాలు చేసుకుందామని చూసేరుగాని, వ్యాపారాల్లో ఎక్కువ తెలివీ, కష్టానికి ఎదురీదే స్వభావం కావాలి. అవసరమైతే మోసం చెయ్యాలి. అన్ని మోసాలకన్నా ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాల ద్వారా ప్రభుత్వాన్ని మోసం చెయ్యడం సులువుకదా. పైగా అక్షర జ్ఞానం లేనివాళ్లకి ఇన్ని ఉద్యోగా లనీ; అక్షరాలు వచ్చిన వాళ్లకి ఇన్ని అనీ ఒక నాయకుడు కొన్నాళ్లు నిరశన దీక్ష పట్టి నిబంధన్లు పెట్టేడు. ఆయన దగ్గరికి అపోజిషన్ పార్టీ, పొజిషన్ పార్టీ , కలెక్టరూ, ఎం.డి.గారూ అందరూ వచ్చి ఆ ఎగ్రిమెంటు రాయించుకున్నారు, తెలుసా?''

"నాకిప్పుడు బోధపడింది నాన్నగారూ. ఇలాంటి సరుకంతా ఉద్యోగాల్లో చేరడం వల్లనే సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకతా పూర్తిగా దెబ్బతినేసి ఫ్యాక్టరీ మట్టికొట్టుకుపోయింది. ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీ నడపడం మావల్ల కాదని చేతులెత్తేసి ఫ్యాక్టరీని వేలం వెయ్యవలసొచ్చింది." అన్నాను పూర్తిగా నిరాశలో మునిగిపోయి. "ఇలాంటి ఫ్యాక్టరీని ఒకదారికి తీసుకురావాలంటే నేనెంత మేధావినైతే మాత్రం, ఎన్ని విదేశాలు తిరిగి వస్తే మాత్రం నావల్ల అవుతుంది?''

"అవన్నీ తరువాత ఆలోచించుకుందాం. డిన్నరుకి టైమ్ అవుతోంది లేచి నడు" అన్నారు నాన్నగారు.

లేవబోయాను. కాని పడిపోయాను.

తీరాచూస్తే అంతా కల, నాన్నగారి చేతిలో ఒక కాగితం ఉంది. "చూడు" అని ఇచ్చారు. నేను దరఖాస్తు చేసిన విదేశీ విశ్వవిద్యాలయం ఫెలోషిప్ నాకు రాలేదని చెప్పి వచ్చిన రిగ్రెట్ లెటర్.

"ఆఖరికి ఆ రామినీడు అన్నంతపనీ చేసేడు. డబ్బు పారేసి సెలక్షన్ కమిటీని లొంగతీసుకుని నాకు వెన్నుపోటు పొడిచేడు.'' అన్నాను.

"కొన్నాళ్లు వోపిక పట్టాలి మరి." అన్నారు నాన్నగారు వేదాంత ధోరణిలో.

*

*("ఆంధ్రభూమి" డెయిలీ: 28-9-88)*